
సాక్షి బాపట్ల
మంగళవారం ׀ 20 ׀ ఫిబ్రవరి ׀ 2024



తిరునాళ్ల ఏర్పాట్లు పరిశీలన

నరసరావుపేటరూరల్: కోటప్పకొండ తిరునాళ్ల ఏర్పాట్లను సోమవారం దేవదాయ శాఖ ఏసీ టి.చంద్రకుమార్, డీసీ బి.మహేష్‌రెడ్డి, సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 517.20 అడుగుల వద్ద ఉంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 817.30 అడుగుల వద్ద ఉంది.



నేటి నుంచి కలశాభిషేకం

పాత గుంటూరు: చౌడవరం గణపతి సచ్చిదానందస్వామి ఆశ్రమంలో మంగళవారం నుంచి పుష్కర బ్రహ్మ కలశాభిషేకం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

హెల్మెట్ ధారణ.. ప్రాణ రక్షణ

జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

బాపట్ల: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల ముగింపు కార్యక్రమం కలెక్టరేట్ ఆవరణలో సోమవారం జరిగింది. హెల్మెట్ పై అవగాహన కల్పిస్తూ ఏర్పాటుచేసిన ర్యాలీని జిల్లా కలెక్టర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. మాసోత్సవాల్లో భాగంగా పాఠశాల విద్యార్థులకు నిర్వహించిన వక్తృత్వ, క్విజ్ పోటీలలో విజేతలైన అరుగురికి కలెక్టర్ చేతుల మీదుగా బహుమతులు అందించారు. జిల్లా రవాణా శాఖ అధికారి ఆర్.సురేష్, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం వి.కృష్ణారెడ్డి, మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌లు డీవీవీ రంగారావు, ఎస్.ప్రసన్నకుమారి, ఏఎంవీఐలు అంకమ్మరావు, బి.కిషోర్, కమిటీ సభ్యులు శ్రీమన్నారాయణ, సాల్మన్, డ్రైవర్లు పాల్గొన్నారు.



జెండా ఊపి హెల్మెట్ అవగాహన ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా

పకడ్బందీగా ఇంటర్మీడియెట్ పరీక్షలు ..

బాపట్ల: ఇంటర్మీడియట్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని అధికారులను జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా ఆదేశించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణపై ఇంటర్మీడియెట్ బోర్డు జిల్లాస్థాయి కమిటీ సమావేశం సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. ఇంటర్మీడియెట్ పరీక్షలు మార్చి ఒకటో తేదీ నుంచి 20వ తేదీవరకు జరుగుతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 35 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామని, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 9,090 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 10,763 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మొత్తంగా జిల్లా నుంచి 19,853 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారని చెప్పారు. ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలకు 400 మంది, ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 450 మంది ఉపాధ్యాయులను ఇన్విజిలేటర్లుగా నియమించాలన్నారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలను రెండు, కస్టోడియస్, సిట్టింగ్ స్క్వాడ్ టీంలను ఏర్పాటు చేయాలన్నారు. పరీక్ష జరిగే సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ సెంటర్లు మూసి వేయించి, కేంద్రాల వద్ద పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. స్ట్రాంగ్ రూముల వద్ద నిరంతరం బందోబస్తు ఉండేలా చూడాలన్నారు. అదనపు ఎస్పీ పి.మహేష్, ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ పి.యర్రయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి కె.నారాయణ, డీపీఓ రవికుమార్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి ఎస్.విజయమ్మ, ఆర్టీసీ ఆర్ఎం వి.కృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ కష్ణకాంత్ పాల్గొన్నారు.

టెన్త్ పరీక్షలు సమర్థంగా నిర్వహించాలి

బాపట్ల: పదవ తరగతి పరీక్షలను అధికారులు అత్యంత పకడ్బందీతో సమర్థంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. పది పరీక్షల నిర్వహణపై సంబంధిత శాఖ అధికారులతో స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో సోమవారం సమావేశం జరిగింది. మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు జరగనున్న పరీక్షలకు జిల్లా నుంచి 18,910 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ఇందుకోసం జిల్లాలో 108 పరీక్ష కేంద్రాలను ఎంపిక చేశామన్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలన్నారు.

స్పందన అర్జీలు సత్వరం పరిష్కరించండి

జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

బాపట్ల అర్బన్: స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వస్తున్న అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. స్పందన కార్యక్రమం సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలు పరిష్కరించాలని అర్జీల ద్వారా కలెక్టర్‌ను కోరారు. తన పరిధిలోని వాటికి ఆయన సత్వరమే పరిష్కార మార్గం చూపగా, మిగిలిన వాటిని పరిశీలన, విచారించాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లో గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ చెప్పారు. అర్జీలు పెండింగ్‌లో ఉండరాదని సంబంధిత అధికారులకు సూచించారు. బాపట్ల ఆర్డీఓ పరిధిలో 6 అర్జీలు, పంచాయతీ శాఖలో మూడు పెండింగ్‌లో ఉండడంపై ఆరా తీశారు. మిగిలిన శాఖలో అర్జీలు పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల నిర్వహణలో జిల్లా నోడల్ అధికారుల పాత్ర చాలా కీలకమన్నారు. మార్చి 3న పల్స్ పోలియో నేపథ్యంలో ప్రజలకు విస్తృతస్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. అమృత్ సరోవర్, మినీ అమృత్ సరోవర్ పనులు వేగంగా చేపట్టాలన్నారు. జిల్లా అధికారులు మండలాల్లో పర్యటించే సమయంలో అమృత్ సరోవర్ పనులు విధిగా పరిశీలించాలని సూచించారు. జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ రంజిత్‌బాషా, జేసీ సీహెచ్ శ్రీధర్

జీజీహెచ్‌లో వైద్యసేవలు భేష్

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు ప్రభుత్వం మెరుగైన వైద్యసేవలు అందిస్తోందని, వైద్యులు, వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి టి.లీలావతి అన్నారు. జీజీహెచ్‌లో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న బాధితులను సోమవారం న్యాయమూర్తి పరామర్శించారు. ఆసుపత్రిలో ఎన్నిరోజుల నుంచి చికిత్స పొందుతున్నారు? వైద్యసేవలు ఎలా ఉన్నాయి? ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉందంటూ బాధితులను ప్రశ్నించారు. రోగుల సహాయకులతో కూడా ఆమె మాట్లాడి ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లిన తరువాత తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. రోగులు వైద్యసేవలు బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు జీజీహెచ్‌లో రోగులను పరామర్శించేందుకు వచ్చామన్నారు. ఆసుపత్రిలో వాంతులు, విరేచనాలతో చికిత్స పొందుతున్న ప్రతి ఒక్కరినీ పలుకరించామని, అందరూ వైద్యసేవలు బాగున్నాయని చెప్పారన్నారు. స్వయంగా పలు వార్డులు పరిశీలించి రోగులకు సకాలంలో వైద్యసేవలు అందుతున్నాయని, పరిశుభ్రత బాగుందనే విషయం తెలుసుకున్నామన్నారు. రోగులకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందించి ప్రాణాలు కాపాడుతున్న వైద్యులను అభినందించారు. జడ్జి వెంట మాజీ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కట్టా కాళిదాసు, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశసజని ఉన్నారు.

మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలి

పొన్నూరు: మార్చి 9న నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా జడ్జి పార్థసారథి తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. సోమవారం పట్టణంలోని అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా జడ్జి పార్థసారథి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బ్యాంకు కేసులు, పీఎల్‌సీలు, క్రిమినల్, సివిల్ కేసులు, పరిష్కరించదగ్గ కేసులు కక్షిదారులతో మాట్లాడి వ్యయ ప్రయాసలకు లోను కాకుండా తక్షణ న్యాయం కోసం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా సన్నద్ధం చేయాలన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ లీలావతి, పొన్నూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు ఎస్.వర్ధన్ రావు, షేక్ బాజీ సాహెబ్, కోర్టు సూపరింటెండెంట్లు హరీష్, కిషోర్, అర్బన్, రూరల్ సీఐలు భాస్కర్, వై.కోటేశ్వరరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి పార్థసారథి

న్యూస్‌రీల్

జెడ్పీలో కారుణ్య, బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ



గుంటూరుఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా పరిషత్ కార్యాలయంలో కారుణ్య నియామకాలతోపాటు బ్యాక్‌లాగ్ పోస్టులకు అర్హులైన అభ్యర్థులకు సోమవారం జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా నియామక ఉత్తర్వులు అందజేశారు. వికలాంగులకు రిజర్వ్ కేటాయించబడిన బ్యాగ్‌లాగ్ ఖాళీలను జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో నిర్వహించిన స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌లో ఆఫీసు సబార్డినేట్ పోస్టుకు ఎంపికై, జెడ్పీకి కేటాయించిన కొప్పురావూరి లక్ష్మయ్యను మేడికొండూరు ఎంపీడీవో కార్యాలయం, బుస్సా సరితను వేమూరు మండలం పెరవలి జెడ్పీ హైస్కూల్లో నియమించారు. రెంటచింతల మండలం మల్లవరం ఎంపీపీ స్కూల్లో ఎస్జీటీగా పనిచేస్తూ మృతి చెందిన ముక్కాల రామసుబ్బయ్య కుటుంబ జీవనాధారం కోసం అతని కుమారుడైన ముక్కాల ఆదర్శ్‌కు సామాజిక భద్రత ప్రాతిపదికన కారుణ్య నియామకంపై జెడ్పీలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమించారు.

రేపు యద్దనపూడిలో ‘జగనన్నకు చెబుదాం’

బాపట్ల: జగనన్నకు చెబుదాం స్పందన కార్యక్రమం యద్దనపూడిలోని శ్రీ ముద్దన హనుమయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నామని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజల వద్దకే జిల్లా యంత్రాంగమంతా వస్తుందని, మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ నెల 21తేదీన బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు జరిగే స్పందనలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజల సమస్యలు అక్కడికక్కడే పరిష్కరిస్తామని తెలిపారు.

దేవాలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ

పాల్గొన్న హైకోర్టు న్యాయమూర్తి బి.కృష్ణమోహన్



చిలకలూరిపేట: మండలంలోని బొప్పూడి గ్రామంలో వేంచేసియున్న చెన్నకేశవ స్వామి, మల్లేశ్వరస్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమం సోమవారం వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సతీసమేతంగా పాల్గొన్నారు. ఆయనకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దేవదాయశాఖ నిధులు రూ.1.50 కోట్లతో పునర్నిర్మాణ పనులు నిర్వహించనున్నారు. పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, డీఎఫ్ఓ ఎస్.రామచంద్రరావు, డిప్యూటీ కలెక్టర్ బి.నారదముని, ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్‌బాబు పాల్గొన్నారు.

రేపు గుంటూరు-వరంగల్ ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలోని ప్రయాణికుల సౌకర్యార్థం గుంటూరు నుంచి వరంగల్‌కు బుధవారం ప్రత్యేక రైలును కేటాయించడం జరిగిందని సీనియర్ డీసీఎం డాక్టర్ సీహెచ్ ప్రదీప్ కుమార్ సోమవారం తెలిపారు. గుంటూరు-వరంగల్ రైలు(07016)గుంటూరు నుంచి ఉదయం 6.40 గంటలకు బయలు దేరి, అదేరోజు మధ్యాహ్నం 12.30 గంటలకు వరంగల్ స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. ఈ ప్రత్యేక రైలు విజయవాడ, మధిర, మోటమర్రి, బోనకల్లు, చింతకాని, ఖమ్మం, పాపటపల్లి, డోర్నకల్, మహబూబాబాద్, కె.సముద్రం, చింతపల్లి స్టేషన్‌ల మీదుగా ప్రయాణిస్తుందని తెలిపారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6600, గరిష్ట ధర రూ.8200, మోడల్ ధర రూ.7200 వరకు పలికింది.

సంతోషాలకు పట్టాభిషేకం

జిల్లాలో శరవేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్లు

- జిల్లావ్యాప్తంగా 878 జగనన్న లే అవుట్లలో 95,188 మంది మహిళలకు ఇళ్ల పట్టాలు
- జగనన్న ఇళ్ల స్థలాలపై లబ్ధిదారులకు సంపూర్ణ హక్కులు
- సెలవు రోజుల్లోనూ రిజిస్ట్రేషన్ ప్రక్రియలో ఉద్యోగులు నిమగ్నం
- స్థిరాస్తి పత్రాలు అందుకొని మురిసిపోతున్న మహిళలు

జిల్లాలో జగనన్న లే అవుట్లు	మంజూరైన ఇళ్ల పట్టాలు	ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూమి	ఇప్పటివరకు రిజిస్ట్రేషన్ పూర్తి చేసిన పట్టాలు	రిజిస్ట్రేషన్లు జరుగుతున్న సచివాలయాల సంఖ్య
878	95,188	1,288.78 ఎకరాలు	61,356	538



ఈ చిత్రంలోని మహిళపేరు అవ్వారు ఆదిలక్ష్మి. భర్త నరేష్. సత్తెనపల్లి కొత్తపేటలో అద్దె ఇంట్లో నెలకు రూ.3 వేలు చెల్లిస్తూ నివాసముంటున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. సొంతిల్లు కట్టుకోవాలని ఆశతో గతంలో అర్జీలు పెట్టుకున్నా స్థలం మంజూరు కాలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ధూళిపాళ్ల జగనన్న కాలనీలో పట్టా మంజూరు అయింది. ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందించారు. ఒక్క పైసా తీసుకోకుండా ఇప్పుడు ఏకంగా ఆదిలక్ష్మి పేరు మీదనే ఇంటి పట్టా రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చారు. ఇక ఈ ఇల్లు మా హక్కు అంటూ ఆ నిరుపేద కుటుంబం ఎంతో సంతోషం వ్యక్తం చేసింది.

సత్తెనపల్లి: ఏ పథకం అమలు చేసినా లబ్ధిదారులకు సంపూర్ణ ప్రయోజనం కలిగేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోంది. అందులో భాగంగానే నిరుపేదలకు ఇచ్చిన ఇంటి స్థలాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కులు కల్పిస్తోంది. ఈ ప్రక్రియ జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వేగంగా సాగుతుంది. పట్టాలు పొందిన వారంతా మహిళలే కాగా, వారంతా ఇప్పుడు లక్షాధికారులు అయ్యారు. ఏన్నో ఏళ్లుగా నిలువనీడలేక ఇబ్బందులు పడిన వారంతా.. రూ. లక్షల విలువైన స్థలంపై సీఎం వైఎస్ జగన్ సంపూర్ణ హక్కులు కల్పించడంతో ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు.

పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్లు..

ఇళ్ల స్థలాలకు సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియ సచివాలయాల్లో జోరుగా సాగుతుంది. సెలవురోజైన ఆదివారం కూడా ప్రక్రియను సచివాలయ సిబ్బంది చేపడుతున్నారు. జిల్లావ్యాప్తంగా 878 జగనన్న లేఅవుట్లలో 95,188 మంది పేద మహిళలకు ప్రభుత్వం ఇంటి పట్టాలు మంజూరు చేసింది. ఇందులో 95,188 మంది పట్టాలను రిజిస్ట్రేషన్ చేసి సంపూర్ణ హక్కులు కల్పించాలని ప్రభుత్వ నిర్ణయించింది. దీంతో వీఆర్వోలు, సచివాలయాల సిబ్బంది ఈ నెల ఒకటవ తేదీ నుంచి రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. లబ్ధిదారు పేరు, వారి కేటాయించిన ప్లాట్ల వివరాలతో పాటు ప్లాట్ల సరిహద్దుల ఆధారంగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపడుతున్నారు. ఇప్పటికే 61,356 పట్టాలు రిజిస్ట్రేషన్ చేశారు. మరో 33,832 మంది పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. గత ప్రభుత్వాలు మొక్కుబడిగా ఇళ్ల పట్టాలిచ్చినా హక్కులు కల్పించక పోవడంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కానీ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం గత ప్రభుత్వాలకు పూర్తి భిన్నంగా రూ. 3 లక్షల నుంచి రూ. 5 లక్షల విలువైన స్థలం ఇవ్వడంతో పాటు వాటిని రిజిస్ట్రేషన్ చేస్తోంది. పైసా ఖర్చు లేకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసి పట్టా చేతిలో పెడుతుంది. అంతేకాకుండా పదేళ్ల తర్వాత అత్యవసర సమయంలో ఆ స్థలం విక్రయించుకునేవిధంగా సర్వ హక్కులు కల్పిస్తూ అసైన్ మెంట్ చట్టం చేసింది. దీంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



సత్తెనపల్లి 15వ సచివాలయంలో రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన మహిళలు

కుటుంబానికి పెద్దదిక్కయ్యారు



ఎన్నో ఏళ్లుగా అద్దె ఇంట్లో బాడుగ కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. నా భర్త చిన్న నాగయ్య మృతి చెందాడు. నా కుమారుడు, నేను వ్యవసాయ కూలీ పనులకు వెళితేనే జీవనం గడిచేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక రాజుపాలెం జగనన్న లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేశారు. స్థలం మంజూరు చేయడమే కాకుండా ఆ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయించి సంపూర్ణ హక్కు కల్పించారు. ఎంతో ఆనందంగా ఉంది. ఇల్లు కట్టుకొని హాయిగా జీవిస్తాం.

– మొగిలి శివమ్మ, రాజుపాలెం

స్థలంపై లబ్ధిదారునికి సంపూర్ణ హక్కులు



స్థలం రిజిస్ట్రేషన్‌తో లబ్ధిదారుడికి సంపూర్ణ హక్కులు సంక్రమిస్తాయి. పేదవర్గాల వారికి ఇది ఎంతో మేలు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కోసం ఆయా గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలో ఉన్నవారు అక్కడే రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చు. పైసా చెల్లించే పనిలేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసి ఇంటి పట్టా చేతికి ఇవ్వడం జరుగుతుంది. ఇప్పటివరకు జిల్లాలో 70 శాతం పట్టాల రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయ్యింది.

– శివశంకర్ లోతేటి, కలెక్టర్, పల్నాడు జిల్లా

రుణాలు సకాలంలో చెల్లించాలి

- జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్
- జగనన్న బడుగు వికాసం కింద రూ.1.24కోట్ల విలువైన వాహనాలు పంపిణీ



కలెక్టరేట్‌లో లబ్ధిదారుడికి కారు తాళాలు అందజేస్తున్న జిల్లా కలెక్టర్, అధికారులు

నరసరావుపేట: జగనన్న బడుగు వికాసం పథకం కింద లబ్ధి పొందిన వారు సకాలంలో బ్యాంకు రుణాలను తిరిగి చెల్లించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ పేర్కొన్నారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సోమవారం ఆరు రకాల వాహనాలు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. గతంలో కలెక్టరేట్‌లో నిర్వహించిన నవోదయంలో దరఖాస్తు చేసుకున్న ఆరుగురు లబ్ధిదారులకు ఈ వాహనాలు 45శాతం రాయితీపై లభించాయి. కలెక్టర్ మాట్లాడుతూ అమరావతి మండలం అత్తలూరుకు చెందిన బంక శ్రీనివాసరావుకు రూ.60లక్షల విలువైన పొక్లెయిన్ లభించగా, నరసరావుపేట పట్టణానికి చెందిన కందుల ఎజ్రా రూ.18లక్షలు విలువైన క్రైటా కారు పొందారు. అలాగే నరసరావుపేట మండలానికి చెందిన కోటేశ్వరరావుకు రూ.9.50లక్షల విలువైన డీజిల్ కారు, అదే మండలానికి చెందిన ఎ.సుభాషిణికి రూ.16లక్షలు విలువైన స్కార్పియో వాహనం, పిడుగురాళ్ల నియోజకవర్గంలోని మాచవరం మండలంకు చెందిన మురికిపూడి కల్యాణి, ఎం.రమేష్‌లకు ఒక్కొక్కరికి రూ.10లక్షలు విలువైన బడా దోస్త్ మినీ లారీలు అందజేశారు. నవోదయం నోడల్ ఆఫీసర్ కె.సంజీవరావు, జిల్లా పరిశ్రమల అధికారి పి.వెంకటేశ్వరరావు, ఎల్‌డీఎం శ్రీనివాస రామ్‌ప్రసాద్, డీఆర్‌డీఏ పీడీ బాలూనాయక్, ఆర్అండ్‌బీ ఈఈ రాజానాయక్, డీఎల్‌డీఓలు గబ్రు నాయిక్, వెంకటరెడ్డి, సుధాకర్, నరసరావుపేట ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ మాధవి, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు ‘హంసలదీవి’ ముస్తాబు

22 నుంచి వేణుగోపాలుడి కల్యాణోత్సవాలు

కోడూరు: శ్రీహరి నారాయణ తత్వాన్ని సంపూర్ణంగా ప్రకటించిన హంసలదీవి క్షేత్రం బ్రహ్మోత్సవ శోభతో కళకళలాడుతోంది. హంసలదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామివారి ఆలయంలో ఈ నెల 22 నుంచి స్వామివార్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. దేశంలోని 56 వైష్ణవ ఆలయాలను దేవతలే నిర్మించారని పురాణాలు చెబుతుండగా, అందులో హంసలదీవి క్షేత్రం కూడా ఉంది. అంతటి మహి మాన్వితమైన క్షేత్రంలో బ్రహ్మోత్సవాలను నిర్వహించేందుకు శృంగేరీ పీఠం ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఏటా మాఘశుద్ధ త్రయోదశి నుంచి బహుళ పాడ్యమి వరకు ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్స వాలు నిర్వహించడం అనాదిగా వస్తోంది. 25 ఏళ్ల నుంచి విజయవాడకు చెందిన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామివారి దేవస్థానం ఆధ్వర్యంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు సాగుతుండగా, గత ఏడాది దుర్గగుడి అధికారులు వేణుగోపాలుడి ఆలయ దత్తతను విరమించుకొని దేవదాయశాఖకు అప్పగించారు.

శృంగేరీ పీఠం ఆధ్వర్యంలో..

దేశంలోనే అత్యున్నతమైన కర్ణాటకలోని శృంగేరీ పీఠం వేణుగోపాలుడి ఆలయాన్ని గత ఏడాది నవంబర్‌లో దత్తతు తీసుకుంది. అప్పటి నుంచి ఆలయంలోని అన్ని కార్యక్రమాలు పీఠం ఆధ్వర్యంలోనే సాగుతున్నాయి. పీఠం ఆలయాన్ని దత్తతు తీసుకున్న తర్వాత తొలి ఉత్సవాలు కావడంతో పీఠం ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించారు. బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని ఆల య ప్రాంగణంలో ప్రత్యేక పందిళ్లను ఏర్పా టు చేస్తున్నారు. నూతన రంగులు, విద్యుత్‌దీపాలతో ముస్తాబు చేస్తున్నారు. కల్యా ణాన్ని తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ఏవిధమైన అసౌకర్యా లు కలగకుండా చర్యలు తీసుకున్నట్లు పీఠం ధర్మాధికారి, టీటీడీ వేదపాఠశాల ప్రిన్సిపాల్ కుప్పా సుబ్రహ్మణ్య అవధాని తెలిపారు.

ఉత్సవాల వివరాలు ఇలా..

➡ 22న ఉదయం స్వామివారికి విశేష స్నపన, పెళ్లి కుమారుడిగా అలంకరణ, సాయంత్రం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్ష స్వీకరణ, అఖండ దీపారాధన, వాస్తుపూజ, వాస్తుహోమం, అంకురార్పణ, ధ్వజారోహణ ఉంటుంది.

➡ 23న ఉదయం బలిహరణ, పంచామృతస్నపన, పాలాభిషేకం, శ్రీరాజ్యలక్ష్మి అమ్మవారికి లక్షకుంకుమార్చన, సాయంత్రం నిత్యహోమం, జగజ్యోతి, రాత్రికి స్వామివార్ల కల్యాణాన్ని నిర్వహిస్తారు.

➡ 24న ఉదయం సాగరసంగమం, పాలకాయతిప్ప బీచ్ వద్ద సింధు స్నానాలకు వచ్చే భక్తులతో ప్రత్యేక పూజలు, రాత్రికి రథోత్సవం నిర్వహిస్తారు



వేణుగోపాలుడి లీలామానుష విగ్రహం

బూత్‌స్థాయి పటిష్టతకు బాధ్యతతో పనిచేయండి

నియోజకవర్గ సమన్వయకర్త చిన హనిమిరెడ్డి



మాట్లాడుతున్న పానెం చిన హనిమిరెడ్డి



సమావేశానికి హాజరైన బూత్ కమిటీ సభ్యులు

అద్దంకి: పార్టీని బూత్ స్థాయిలో పటిష్టం చేయాల్సిన బాధ్యత బూత్ కమిటీలపై ఉందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పానెం చిన హనిమిరెడ్డి అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన సోమవారం బూత్ కమిటీ సభ్యుల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హనిమిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికలు సమీపించాయని ఎన్నో రోజులు లేవన్నారు. బూత్ కమిటీ సభ్యులు ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఎటువంటి సమస్య తలెత్తినా తన దృష్టికి తీసుకుని వస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. అద్దంకిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేసి రాష్ట్ర ముఖ్యమంత్రిగా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేసుకోవాలని చెప్పారు. ఎక్కడైనా ఓటరు జాబితాలో అవకతవకలు జరిగినా, బూత్‌ల వద్ద అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నా అప్రమత్తంగా ఉండి తెలియజేయాలని కోరారు. సమావేశంలో బాపట్ల జిల్లా పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి హనుమంతరావు, స్థానిక నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు పాల్గొన్నారు.

స్పందన అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎస్పీ వకుల్‌జిందాల్



ఎస్పీ వకుల్‌జిందాల్‌కు సమస్య వివరిస్తున్న వృద్ధుడు

బాపట్లటౌన్: స్పందన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ వకుల్‌జిందాల్ సూచించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 50 మంది బాధితులు ఎస్పీ కార్యాలయానికి చేరుకొని సమస్యలను నేరుగా ఎస్పీ వకుల్‌జిందాల్, అడిషనల్ ఎస్పీ పి.మహేష్‌లకు వివరించారు. బాధితుల సమస్యలను క్షుణ్ణంగా తెలుసుకున్న ఎస్పీ వకుల్‌జిందాల్ సంబంధిత స్టేషన్‌ల సీఐ, ఎస్‌ఐలతో మాట్లాడి సమస్యలను తక్షణమే పరిష్కరించేలా చూడాలన్నారు. బాధితులను రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ తిప్పినా, వారిని వేధింపులకు గురిచేసినా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్‌బీ సీఐ మురళీకృష్ణ, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు

బాపట్లటౌన్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే ఉపేక్షించేది లేదని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ హెచ్చరించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఆదివారం రాత్రి జిల్లా వ్యాప్తంగా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించిన 387 మందిపై కేసులు నమోదు చేశారు. జిల్లాలోని నిర్మానుష్య ప్రదేశాల్లోని కల్వర్టులు, నిరుపయోగంగా ఉన్న ప్రదేశాల వద్ద గస్తీ నిర్వహించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు బానిసైన కొందరు యువకులు జిల్లాలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తూ శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని అన్నారు. మహిళలు, పాదచారులకు తీవ్ర అసౌకర్యం కలిగిస్తున్నారన్నారు. అనేక నేరాలకు మూల కారణం బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడమేనని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించే వారిపై చర్యలు తీసుకుంటే నేరాలు తగ్గుతాయన్నారు. జిల్లాలో ఎవరైనా బహిరంగంగా మద్యం సేవిస్తూ ఉన్నట్లయితే అట్టి సమాచారాన్ని వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్ ఎస్ఐ, జిల్లా ఎస్పీ హెల్ప్ లైన్ నెంబర్ 8333813228, టోల్ ఫ్రీ నంబర్ 112, 100 లకు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

వైద్యరంగం అభివృద్ధికి నూతన సంస్కరణలు

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



నూతనంగా నిర్మించిన అదనపు గదులను ప్రారంభిస్తున్న మోపిదేవి, డాక్టర్ ఈవూరి

రేపల్లె రూరల్: వైద్యరంగం అభివృద్ధికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శద్ధ వహిస్తున్నారని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. పట్టణంలోని సామాజిక వైద్యశాలలో రూ.1.11కోట్లతో అదనంగా నిర్మించిన గదులతో పాటు, స్పెషాలిటీ ఓపీ బ్లాక్‌ను నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్‌తో కలిసి ప్రారంభించారు. పేదలు వైద్యం అందక ప్రాణాలు కోల్పోరాదనే ఉద్దేశ్యంతో వైద్య రంగంలో సీఎం జగన్ అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. రోగులు ఫోన్‌చేసిన వెంటనే వైద్యశాలకు తీసుకువెళ్లే 108 వాహనాలలో అత్యాధునిక సదుపాయాలు ఏర్పాటు చేశారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో నిష్ణాతులైన వైద్య బృందాలతో వాడవాడలా వైద్యశిబిరాలు నిర్వహించి పేదల ముంగిటకు వైద్యసేవలు తీసుకువెళ్లటం శుభపరిణామమని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబానికి ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25లక్షల వరకు వైద్య సేవలు అందేలా ఏర్పాట్లు చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ మాట్లాడుతూ విద్య, వైద్యం విలువలు తెలిసిన వ్యక్తిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆ రంగాలకు చేస్తున్న సేవలు ఎనలేనివన్నారు. జనం కోసం పరితపించే సీఎం జగన్‌కు ప్రజలు మరోసారి పట్టం కట్టాలని కోరారు. అనంతరం వైద్యశాలలో ఏర్పాటు చేసిన అదనపు గదులను, స్పెషాలిటీ ఓపీ బ్లాక్‌లను ప్రారంభించారు. కార్యక్రమంలో బవుడా చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ గడ్డం రాధాకృష్ణమూర్తి, మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, వైస్‌చైర్మన్‌లు గుజ్జర్లమూడి ప్రశాంత్‌కుమార్, తూనుగుంట్ల కాశీవిశ్వనాథగుప్త, రెడ్‌క్రాస్ బ్లండ్ బ్యాంక్ కౌన్సిలర్‌లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు కార్పొరేషన్ డైరెక్టర్‌లు పాల్గొన్నారు.

బాపట్ల జిల్లా చిత్రకారుడికి ఘన సన్మానం



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరెడ్డి

హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారం అందజేత



శ్రీనివాసరెడ్డి చిత్రీకరించిన గిరిజన యువతి

చినగంజాం: బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన సూరిన శ్రీనివాసరెడ్డి జాతీయ స్థాయి గ్రేట్ ఆర్టిస్ట్ అవార్డు అందుకున్నారు. ఆదివారం సాయంత్రం గుంటూరు విజ్ఞాన మందిర్‌లో ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చర్ కమిషన్, గుంటూరు క్రియేటివ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ సంయుక్త సమర్పణలో నేషనల్ ఆర్ట్ కాంపిటీషన్ ఎగ్జిబిషన్ అండ్ ఎక్స్‌పోలో ఆయన పాల్గొన్నారు. ఇండియా ఆర్ట్ ఫెస్టివల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 'గిరిజన జాతికి చెందిన తల్లి జీవన పయనం' అనే అంశంపై ఆయన గీచిన చిత్రాన్ని ప్రదర్శనకు ఉంచడంతో నిర్వాహకులు ఎంపిక చేసి ఆయనకు అవార్డు అందజేశారు. అవార్డును హైకోర్టు జడ్జి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. కార్యక్రమంలో తెలుగు ప్రపంచ ఆర్టిస్ట్ ఆర్ట్ అసోసియేషన్ కార్యదర్శి కే బాలయోగి, ఏపీ స్టేట్ క్రియేటివిటీ అండ్ కల్చరల్ కమిషన్ సీఈవో రేగుళ్ల మల్లికార్జునరావు, సీనియర్ కార్టునిస్ట్ టీ వెంకటరావు, నిర్వాహకులు డాక్టర్ కూరపాటి బాబు, సునీతాబాబు తదితరులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ఆసరా నమూనా చెక్కు పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: రూరల్ మండలం పరిధిలో వైఎస్సార్ నాలుగో విడత ఆసరా సంబరాలు సోమవారం స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డులో అట్టహాసంగా జరిగాయి. మండల పరిధిలోని వివిధ గ్రామాల్నుంచి తరలివచ్చిన వేలాది మంది మహిళలతో మార్కెట్ యార్డులోని షెడ్లు నిండిపోయాయి. ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ మండల పరిధిలోని డ్వాక్రా సంఘాలకు నాలుగో విడతగా రూ.12.56 కోట్ల నమూనా చెక్కును అందజేశారు. సభకు పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ఎంపీడీవో శిల్ప, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నేతలు హాజరయ్యారు.

ఆంగ్ల ఉపాధ్యాయుడికి అరుదైన గౌరవం



ఐలవరం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కి చెందిన ఆంగ్ల ఉపాధ్యాయుడు పచ్చారు హరికృష్ణ 'గ్లోబల్ టీచర్ ప్రైజ్ టాప్ 50'ఫైనలిస్టుగా రాష్ట్రం తరపున నిలవడం పట్ల సోమవారం రేపల్లె రోటరీక్లబ్ వొకేషనల్ అవార్డుతో ఘనంగా సన్మానించింది. స్థానిక రామకృష్ణ విద్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రోటరీ గవర్నర్ బూసిరెడ్డి శంకరరెడ్డి హరికృష్ణ దంపతులను ఘనంగా సత్కరించారు. క్లబ్ అధ్యక్షుడు మాదాల మోహన్‌లాల్ సక్సేన మాట్లాడుతూ హరికృష్ణ సేవలు ఎందరికో స్ఫూర్తిదాయకం కావాలని ఆకాంక్షించారు. ఈయన రేపల్లె ప్రాంత వాసి కావడం గర్వంగా ఉందన్నారు.

అంజుమన్ ఇస్లామియా కమిటీ అధ్యక్షుడిగా అబ్దుల్ రహీం



అంజుమన్ ఇస్లామియా నూతన కమిటీ పాలకవర్గం

బాపట్ల: బాపట్ల అంజుమన్ ఇస్లామియా కమిటీకి ఆదివారం ఎన్నిక జరిగింది. కమిటీ నూతన అధ్యక్షులుగా షేక్ అబ్దుల్ రహీం జానీ, కార్యదర్శిగా షేక్ అబ్దుల్ కరీం ఎన్నికయ్యారు. ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగిన ఓట్ల లెక్కింపులో అంజుమన్ కమిటీ ఎన్నికల్లో విజయం సాధించిన కమిటీ పేర్లను ఎన్నికల అధికారి వి సత్యనారాయణ ప్రకటించారు. షేక్ బాజీవలి సంయుక్త కార్యదర్శిగా, మహమ్మద్ రఫీ కోశాధికారిగా, కార్యవర్గ సభ్యులుగా అబ్దుల్ సత్తార్ షేక్ మౌలాలి, షేక్ ఆదం, షేక్ ఖాసిం, షేక్ ఖాదర్ బాష, అబ్దుల్ ముజీర్ ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు డీఎస్పీ వెంకటేశులు, పట్టణ సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

జేఏసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఈదులముడి

పట్నంబజారు: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా జేఏసీఎస్ జిల్లా కోఆర్డినేటర్‌గా ఈదులముడి డేవిడ్‌రాజును నియమించారు. ఈ మేరకు సోమవారం కేంద్ర పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి.

గ్రామాల పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం

జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్



కొణిదెనలో జరుగుతున్న వైద్య శిబిరంలో పాల్గొన్న రాజ్‌కుమార్

బల్లికురవ: జగనన్న స్వచ్ఛ సంకల్పంలో భాగంగా గ్రామాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అప్పుడే ఆరోగ్య వంతమైన సమాజ స్థాపన సాధ్యపడుతుందని జిల్లా మలేరియా అధికారి రాజ్‌కుమార్, చీరాల డీఎల్‌పీవో హనుమంతరావు సూచించారు. సోమవారం కొణిదెన గ్రామంలోని ఎస్సీ కాలనీలో జరుగుతున్న వైద్యశిబిరాన్ని వారు పరిశీలించారు. వారు మాట్లాడుతూ సైడు కాలువల్లో వ్యర్థాలు పడవేయడం వల్ల మురుగునీరు ముందుకు కదలక దోమలు విజృంభిస్తున్నాయన్నారు. దోమల విజృంభణతో సీజనల్ జ్వరాలు, ప్రాణంతక వ్యాధులు సోకే ప్రమాదం ఉందన్నారు. వ్యర్థాలను, తడి, పొడి చెత్తను గ్రీన్ అంబాసిడర్ల రిక్షాలోనే వేయాలన్నారు. ప్రభుత్వం మెరుగైన వైద్యాన్ని పేదలకు అందుబాటులోకి తెచ్చిందని, ప్రైవేటు వైద్యశాలలకు వెళ్లి వేలకు వేలు డబ్బు ఖర్చు చేసుకోవద్దని రాజ్‌కుమార్ వివరించారు. కార్యక్రమంలో గుంటుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి షేక్ రమీజ్ అహమ్మద్, వైద్య సిబ్బంది, ఈవోఆర్డీ లేపాక్షి విష్ణు, సెక్రటరీ సీహెచ్ వరప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

మాయమాటలు చెప్పే నాయకులను మమ్మొద్దు

ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

బల్లికురవ: మాయమాటలు చెప్పే ప్రజా ప్రతినిధులను ప్రజలు నమ్మవద్దని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి కోరారు. సోమవారం బల్లికురవ మండలంలోని చెన్నుపల్లి, సంతమాగులూరు, మక్కెనవారి పాలెం గ్రామాల్లో పలు కార్యక్రమాల్లో పాల్గొని తిరిగి వెళ్తూ బల్లికురవలో మీడియాతో మాట్లాడారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చటం వల్ల ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రోజు రోజుకూ గ్రాఫ్ పెరుగుతోందన్నారు. అద్దంకి అసెంబ్లీ స్థానానికి సమర్థుడైన అభ్యర్థి పానెం చినహనిమిరెడ్డిని ఎంపిక చేయటం మీ అందరి అదృష్టమన్నారు. హనిమిరెడ్డిని గెలిపించుకునేందుకు తన సహాయ సహకారాలు అందిస్తానని బలరాం ప్రకటించారు. సమావేశంలో స్థానిక నేతలు చల్లగుండ్ల కోటిస్వామి, కందిమళ్ల హరినాథబాబు, ఏల్చూరి రవీంద్రబాబు, నార్నే తిరుపతి రాయుడు, గగ్గెర లక్ష్మీనారాయణ, పావులూరి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఉరి వేసుకుని బాలుడు బలవన్మరణం

పర్చూరు (చినగంజాం): తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన కుమారుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ విషాద ఘటన పర్చూరు మండల కేంద్రంలో సోమవారం జరిగింది. ఎస్ఐ ఎస్.రమేష్ వివరాల మేరకు.. పర్చూరు గ్రామానికి చెందిన షేక్ మౌలాలి కుమారుడు షేక్ జిలాని (14) స్థానికంగా ఓ స్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. తక్కువ మార్కులొచ్చాయని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురై జిలాని సోమవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో బాత్‌రూం లోని హ్యాంగర్‌కు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పర్చూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

హత్య కేసులో నిందితులకు జైలుశిక్ష

తాడేపల్లిరూరల్ : మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని పెనుమాక, కృష్ణాయపాలెం గ్రామాల మధ్య పంట పొలాల్లో జరిగిన హత్యకేసులో గుంటూరు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి జి.మాధవి సోమవారం తీర్పు వెల్లడించారు. కృష్ణాయపాలెం, పెనుమాక అమరావతి రోడ్డులోని కొండవీటి వాగు ఒడ్డున ఉన్న బెండతోటలో ఈ నెల 14న బుల్లా రవికుమార్ అనే వ్యక్తి హత్యకు గురయ్యాడు. కృష్ణాయపాలెంకు చెందిన బుల్లా రవికుమార్ తండ్రి సామ్యేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ సీఐ మధుసూదనరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. బుల్లా రవికుమార్ హత్యకు కారకులు అతని భార్య రాణి మరియు పెనుమాకకు చెందిన కిరణ్‌లని పోలీసులు దర్యాప్తులో కనుగొన్నారు. వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హత్య చేసినట్లు ఋజువు కావడంతో గుంటూరు 2వ అదనపు జిల్లా కోర్టు జడ్జి వారి వారిద్దరికీ యావజ్జీవ శిక్ష విధించారు. వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు.

పదో తరగతి పరీక్షల నిర్వహణపై దృష్టి పెట్టండి

గుంటూరు వెస్ట్ : పదో తరగతి పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి సూచించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ వచ్చే నెల 18 నుంచి 30 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 420 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి మొత్తం 31,291 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. దీని కోసం ఇప్పటికే 147 కేంద్రాలను గుర్తించామన్నారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, విద్యుత్, పార్కింగ్, తదితర ఏర్పాట్లు సమన్వయంతో చేయాలన్నారు. పరీక్షల నిర్వహణలో సిబ్బందికి సందేహాలు, సమస్యలు ఉంటే కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలను తప్పక పాటించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు కె.స్వాతి, లక్ష్మీ కుమారి, డీఈఓ శైలజ, ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బ్యాంకు అధికారి ఇంట్లో భారీ చోరీ

- బీరువా తాళం పగులగొట్టి 50 సవర్ల బంగారం, నగదు అపహరణ
- కేసు దర్యాప్తును ప్రారంభించిన పోలీసులు



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న సీఐ కృష్ణయ్య

అద్దంకి: బ్యాంకు అధికారి ఇంట్లో భారీ చోరీ జరిగిన ఘటన పట్టణంలోని న్యూ ఎస్‌బీఐ కాలనీలో శనివారం జరగగా సోమవారం వెలుగు చూసింది. పోలీసుల సమాచారం మేరకు.. ఎస్‌బీఐ అద్దంకి బ్రాంచ్‌లో పెద్ది అరవింద్ అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. ఇతను స్థానిక న్యూ ఎస్‌బీఐ కాలనీలోని ఇంట్లో నివసిస్తున్నారు. ప్రతి శనివారం తన అత్తగారి ఇంటికి వెళ్లి సోమవారం తిరిగి వస్తుంటారు. ఈ క్రమంలో శనివారం రాత్రి అత్తగారి గ్రామమైన కుర్రవానిపాలేనికి కుటుంబ సమేతంగా వెళ్లారు. సోమవారం తిరిగి ఇంటికి వచ్చే సమయానికి మెయిన్ గేట్ గ్రిల్‌కు ఉన్న తాళాన్ని తీసివేసి నట్లు కనిపించడంతో ఇంట్లో చోరీ జరిగినట్లు భావించారు. లోపలికి వెళ్లి చూడగానే బీరువా పక్కనే ఉన్న తాళం చెవితో బీరువాను తెరచినట్లు నిర్ధారించుకున్నారు. అందులో దాచి ఉంచిన 50 సవర్ల బంగారం, రూ.లక్ష నగదు దొంగలు అపహరించినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ కృష్ణయ్య చోరీ జరిగిన ఇంటికి వెళ్లి పరిశీలించారు. అరవింద్ బంగారాన్ని బ్యాంకు లాకర్‌లోనే భద్రపరుచుకుంటారు. ఇటీవల ఓ శుభకార్యం కోసం లాకర్‌లో నుంచి బంగారాన్ని తెచ్చి ఇంట్లో పెట్టుకున్నారు. దీనిని గమనించిన వారే చోరీకి పాల్పడి ఉంటారనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. క్లూస్ టీం వచ్చి వేలిముద్రలు సేకరించుకుని వెళ్లారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి



మృతి చెందిన సుశీల

చెరుకుపల్లి: కంటి వైద్య పరీక్షలు చేయించుకునేందుకు తెనాలి బయలు దేరిన మహిళ రోడ్డు దాటుతుండగా ఆర్టీసీ బస్సు ఢీకొని మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చెరుకుపల్లి పంచాయతీ పరిధిలోని కొత్తపేటకు చెందిన తాళ్లపల్లి సుశీల(57) అనే మహిళ కంటి వైద్యం చేయించుకునేందుకు సోమవారం ఉదయం తెనాలి వెళ్లేందుకు బస్సు ఎక్కేందుకు గానూ స్థానిక అంబేడ్కర్ సెంటర్ నందు జాతీయ రహదారి దాటుతుండగా రేపల్లె నుంచి గుంటూరు వెళుతున్న ఆర్టీసీ ఎక్స్‌ప్రెస్ బస్సు ఢీకొంది. స్థానికులు ఆమెను దగ్గరలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడ వైద్యం పొందుతూ సుశీల మృతి చెందింది. మృతురాలి కుమారుడు సుబ్బారావు ఫిర్యాదు మేరకు ఎస్సై వై.సురేష్ కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ఏరియా వైద్యశాలకు తరలించారు. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

సాయుధ దళాల నిధికి రూ.లక్ష విరాళం

జిల్లా కలెక్టర్‌కు అందజేసిన కోస్టల్ బ్యాంకు అధికారులు



జిల్లా కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి చెక్కును అందజేస్తున్న కోస్టల్ బ్యాంకు అధికారులు

గుంటూరు వెస్ట్ : సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి కోస్టల్ బ్యాంకు అధికారులు రూ.లక్ష విరాళాన్ని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. సోమవారం స్థానిక బృందావన్ గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ చెక్కును జిల్లా సంక్షేమ అధికారి ఆర్ గుణశీలకు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ కోస్టల్ బ్యాంకు ఇచ్చిన విరాళం ఎంతో గొప్పదన్నారు. ఇదే స్ఫూర్తితో మిగతా సంస్థలు ముందుకు రావాలన్నారు. దేశ రక్షణ కోసం ప్రాణ త్యాగాలకు వెనుకాడని సైనికులకు మన వంతు సాయం అందించాలని కోరారు. కార్యక్రమంలో కోస్టల్ బ్యాంకు క్లస్టర్ హెడ్ జె.హరిప్రసాద్, షేక్ గౌస్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.